క్లుప్తంగా

వృద్ధురాలు అదృశ్యం


బైరు సూరమ్మ

మద్రిపాలెం: కంచరపాలెం బర్మాక్యాంప్‌లో నివసిస్తున్న తన కుమార్తె వద్దకు ఇటీవల వచ్చిన బైరు సూరమ్మ(68) అనే వృద్ధురాలు అదృశ్యమైంది. ఈ మేరకు కంచరపాలెం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. పోలీసుల తెలిపిన వివరాలు..డి.లక్ష్మి అనే మహిళ కంచరపాలెం బర్మాక్యాంప్‌లో నివసిస్తోంది. ఈమె తల్లి బైరు సూరమ్మ(68) వేరే ఊరి నుంచి పదిరోజుల క్రితం ఆమె దగ్గరకు వచ్చింది. మంగళవారం ఉదయం 7.30 గంటల ప్రాంతంలో నుంచి బయటకు వెళ్లిన ఆమె తిరిగి ఇంటికి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ప్రయోజనం లేకపోయింది. కుమార్తె లక్ష్మి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వృద్ధురాలికి మతిస్థిమితం సరిగా లేదు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలి


సమీక్ష సమావేశంలో పాల్గొన్న వార్డు అధ్యక్షుడు పైడి రమణ

తాటిచెట్లపాలెం: బూత్ కన్వీనర్లు అప్రమత్తంగా ఉండాలని వైఎస్సార్‌సీపీ నాయకులు సూచించారు. జీవీఎంసీ 45వ వార్డు భీమిలి నియోజకవర్గ పరిధిలో గల పోలింగ్ బూత్ కన్వీనర్లతో తాటిచెట్లపాలెం 80ఫీట్ రోడ్‌లో ట వార్డు ఎన్నికల కార్యాలయంలో కార్పొరేటర్ కంపా హనోకు ఆధ్వర్యంలో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కన్వీనర్లు అనుసరించాల్సిన విధులు, ఓటర్ల తనిఖీల గురించి వివరించారు. సమావేశంలో వార్డు అధ్యక్షుడు పైడిరమణ, కారుకొండ రాజు, సింగంపల్లి రామారావు, చింతల బాబూరావు, రవిశంకర్, సురేష్, సత్యానందం రెడ్డి, ఎల్లాజీరావు, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పుష్పాలంకరణలో నూకాంబిక దర్శనం


పుష్పాలంకరణలో నూకాంబికా అమ్మవారు

మురళీనగర్: కొత్త అమావాస్య మహోత్సవాల్లో భాగంగా 49వ వార్డు బర్మా క్యాంప్ సమీపంలోని జైభరత్‌నగర్‌లో నూకాంబికా అమ్మవారికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ధూప దీప నైవేద్యాలను సమర్పించి, కుంకుమ పూజలు చేశారు. ఈ సందర్భంగా నూకాంబికా అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి, భక్తులకు దర్శనం కల్పించారు.

దువ్వాడ రైల్వే స్టేషన్‌లో గంజాయి స్వాధీనం

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్‌లో మంగళవారం 14 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఆర్‌పీవోపీపీ ఎస్‌ఐ కె.శాంతారాం తెలిపిన వివరాలిలా ఉన్నాయి. విశాఖ జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో దువ్వాడ రైల్వే స్టేషన్ ప్లాట్‌ఫారంపై తనిఖీలు నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి బ్యాగులో రూ.71,050 విలువ గల 14 కేజీల గంజాయిని గుర్తించారు. బ్యాగును సీజ్ చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు శాంతారాం తెలిపారు.

పండుటాకులపై పగ

ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటిముందు ప్రత్యక్షమయ్యే వలంటీర్ ఈ సారి రాలేదు... ఠంచన్‌గా వచ్చే పెన్షన్ అందలేదు. ఇన్నాళ్లూ కదుపులో చల్ల కదలకుండా చూసుకునే వలంటీర్లు రాకపోయే సరికి అవ్వాతాతలు, దివ్యాంగుల్లో ఆందోళన...స్వార్థ రాజకీయాల కోసం చంద్రబాబు అండ్ బ్యాచ్ తమను కష్టాలకు గురిచేశారని ఆగ్రహం... కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. గంటల తరబడి మండుటెండలో బారులు తీరవలసిన అవస్థలు మళ్లీ మొదలయ్యాయని ఆవేదన... మరో వైపు ఎన్నికల కమిషన్ ఆంక్షలు సడలిస్తుందేమో...వలంటీర్లు ఇంటికి వచ్చి పింఛన్ ఇస్తారేమోనని కళ్లలో ఒత్తులు వేసుకుని ఎదురుచూపులు... ఇది గత రెండు రోజులుగా వృద్ధుల దుస్థితి.

- రెండు రోజులుగా పింఛన్ కోసం అవ్వాతాతల ఎదురుచూపులు
- డబ్బు అందక ఆవేదన
- వలంటీర్లు ఇంటికొచ్చి ఇస్తారేమోనన్న ఆశ
- సచివాలయానికి వెళ్లాలని చెబుతుండడంతో ఆందోళన
- కుట్రలు చేస్తున్న ప్రతిపక్షాలపై ఆగ్రహం

ఉత్తర నియోజకవర్గంలో పింఛన్‌దారుల వివరాలు

వార్డు	లబ్ధిదారులు	నగదు(రూ.ల్లో)
42	162	4,12,750
43	217	6,29,000
44	1021	27,80,150
45	1323	37,80,150
46	929	20,80,174
47	1173	29,07,200
48	1038	26,90,150
49	989	21,80,130
50	989	21,90,120
51	921	21,68,130
53	712	19,48,110
54	828	18,48,130
55	715	20,12,130


సీతంపేటలో వార్డు కార్యాలయం వద్ద పింఛను కోసం వృద్ధుల పడిగాపులు (ఫైల్)

సీతంపేట/ మద్రిపాలెం/తాటిచెట్లపాలెం/కంచరపాలెం: సూర్యోదయంతో పోటీపడుతూ ప్రతినెలా ఒకటో తేదీన వలంటీర్లు ఇంటికి వచ్చి తలుపు తట్టి పింఛను డబ్బులు అవ్వాతాతల చేతిలో పెట్టేవారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా వృద్ధులు, దివ్యాంగులు, వ్యాధిగ్రస్తులు గుమ్మం కదలకుండా ఇంటి వద్ద వలంటీర్ల చేతుల మీదుగా ఠంఛనుగా పింఛను సొమ్ము అందుకుంటున్నారు. అయితే ఈ నెల రెండో తేదీ నాడు కూడా పింఛన్ అందలేదు... మందుల కొనుగోలు, ఇతర అవసరాల ఎలా తీర్చుకోవాలో తెలియక పింఛన్‌దారులు ఆందోళన చెందుతున్నారు. ఇంటికి ఎవరు వచ్చినా... పింఛను సొమ్ము తెచ్చారేమోనన్న ఆశగా ఎదురుచూస్తున్నారు. 3వ తేదీ నుంచి సచివాలయంలో పింఛన్లు ఇస్తారని తెలుసుకున్న కొంతమంది ఎలా వెళ్లాలి, ఎవరి సాయంతో వెళ్లాలి, మండు టెండలో ఎంత సేపు నిరీక్షించాలన్న ఆలోచనలతో మళ్లీ పాత గడ్డు రోజులను గుర్తు చేసుకుంటూ మదన పడుతున్నారు. ఒకటో తేదీనే ఇంటి వద్దే పింఛన్ సొమ్ము అందజేయడాన్ని సహించలేని చంద్రబాబు అండ్ కో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుకున్నారని, మా పట్ల ఇంత నిర్దయగా ప్రవర్తించడం అన్యాయమని వారు వాపోతున్నారు. వలంటీర్లు పనిచేయకుండా అడ్డుకోవడం దారుణమని, ఇటువంటి వారిని ఆ దేవుడు కూడా క్షమించడని పింఛనుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అలవాటైన వలంటీర్లు కాకుండా ఆ పనికి కొత్త వారిని నియమిస్తే సక్రమంగా ఇవ్వగలరా, ఎన్ని రోజులు పడుతుంది, అప్పటి వరకు సచివాలయాల వద్ద పడిగాపులు కాయాల్సిందేనా అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సచివాలయానికి ఎలా వెళ్లాలి, ఎవరి సాయంతో వెళ్లాలో అర్థం కాక దివ్యాంగులు, డయాలసిస్ చేయించుకుంటున్న రోగులు ఆలోచనలో పడ్డారు. ఇప్పటికైనా పండుటాకుల విషయంలో రాజకీయాలు మాని ఎప్పటిలాగే వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్లు పంపిణీ చేయాలని, లేదంటే వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెబుతామని అంటున్నారు.

చంద్రబాబుకు మానవత్వం లేదు



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఇంటికి వచ్చి వలంటీర్ పింఛన్ డబ్బులు ఇస్తున్నారు.ఈ సారి డబ్బుల కోసం రెండురోజులుగా ఎదురుచూస్తున్నాను. ఎలక్షన్ల వల్ల వలంటీర్ ఇంటికి రాదు, సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. పాత రోజులు గుర్తుకు వచ్చి భయమేస్తోంది. చంద్రబాబు టైంలో పింఛను పుస్తకం పట్టుకుని మండుటెండలో వార్డు ఆఫీసు వద్ద గంటల తరబడి లైన్‌లో పడిగాపులు కాసేదాన్ని. జగన్‌బాబు వచ్చాక ఆ పరిస్థితి పోయింది. గుమ్మం కదలకుండా ఇంటి వద్ద వలంటీర్ పింఛను డబ్బులు ఇస్తున్నాడు. పింఛను మీద ఆధారపడి జీవిస్తున్నాను. వలంటీర్ల ద్వారా పింఛను పంపిణీ ఆపివేయడం దారుణం. మా లాంటి ముసలివాళ్ల విషయంలో చంద్రబాబు రాజకీయాలు చేయడం న్యాయమేనా. కనీసం మానవత్వం లేదా. వృద్ధులను ఇబ్బంది పెట్టకుడా వలంటీర్ల ద్వారా ఇంటి వద్ద పింఛన్ ఇచ్చేలా చూడాలి.

– హసీనా బాను, ఎంటీసీపాలెం

మా బతుకులతో ఆడుకుంటున్నారు



పింఛన్‌పై ఆధారిపడి జీవించే మా బతుకులతో ఆటలాడుతున్నారు. పింఛన్ మాలాంటివారి జీవితాలకు ఆసరాగా ఉంటోంది. రాజకీయ కుట్రలతో ఈనెల ఎదురు చూసే పరిస్థితులు కల్పించారు. సచివాలయాలకు వెళ్లినా పింఛన్లు ఇవ్వకపోవడంతో ఎండలో అటు ఇటు తిరిగే పరిస్థితి ఏర్పడింది.

– గుమ్మడి సూర్యకాంతం, కంచరపాలెం, కంచరపాలెం

ఈ వయసులో ఎలా వెళ్లాలి ?



నా వయస్సు 80 ఏళ్లు. నా అన్న వారు ఎవరూ లేరు. ఒంటరిగా ఉంటున్నాను. పింఛన్‌తోనే జీవనం సాగిస్తున్నాను. ఇప్పటి వరకు వలంటీర్ ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవారు. చంద్రబాబు నాయుడు చేసిన కుట్రవల్ల ఇప్పుడు సచివాలయానికి వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఈ వయసులో ఎలా వెళ్లి పింఛను తీసుకోగలను. తీసుకెళ్లేవారు లేరు. నాలాంటి వాళ్లు చాలా మంది ఇబ్బందులు పడతారు. జగనన్న కొడుకులా మా కష్టాలను అర్థంచేసుకుని ఇంటి వద్దే పింఛను అందిస్తుంటే, చంద్రబాబు ఇలా చేయడం సరి కాదు.ఇలాంటి నాయకులని తరిమికొట్టాలి.ఇప్పుడు

– సుభద్రమ్మ, మాధవధార,విశాఖపట్నం

ఇంత అన్యాయమా..



నేను దివ్యాంగురాలిని, వలంటీర్ వచ్చి ప్రతి నెల ఒకటో తేదీన దివ్యాంగ పెన్షన్ నగదు ఇచ్చేవారు. ప్రతిపక్షాల కుట్రలతో ఈ నెల వలంటీర్ పింఛన్ ఇవ్వలేదు. నడవలేని పరిస్థితిలో ఉన్న నేను సచివాలయానికి వెళ్లి ఎలా పింఛన్ తీసుకోగలను. ఆటోలో వెళ్లే ఆర్థిక పరిస్థితి లేదు. నా లాంటి వాళ్లు చాలామందే ఉన్నారు. మమ్మల్ని ఇబ్బంది పెడితే తర్వాత అనుభవిస్తారు.ఓట్లతోనే బుద్ధి చెప్పాలి.ఇంత అన్యాయం ఎక్కడా లేదు.

– సనపల శ్రీదేవి, మాధవధార

మా ఇబ్బందులు చంద్రబాబుకు ఎలా తెలుస్తాయి



ప్రతి నెలా ఒకటో తారీఖున ఠంచనుగా అందే పింఛన్ ఇప్పటి వరకు రాలేదు. వలంటీర్లు పింఛన్లు ఇవ్వరని, మేమే ఎక్కడికో వెళ్లి తీసుకోవాలని చెబుతున్నారు. ఎప్పుడు వెళ్లాలో తెలియడం లేదు. వృద్ధాప్యంలో బలహీన స్థితిలో ఉన్న నేను ఎక్కడికో ఎలా వెళ్లాలి. వలంటీర్లను తప్పించడం సరికాదు. చంద్రబాబుకు మా లాంటి వాళ్ల ఇబ్బందులు ఎలా తెలుస్తాయి.

– రాయల సత్తమ్మ, చిట్టిబాబుకాలనీ

మంచం మీద నుంచి లేవలేను..



ఇంతవరకు ఏ ఇబ్బందులు లేకుండా పింఛన్ తీసుకున్నాను. వలంటీర్ మా ఇంటికే వచ్చి డబ్బులిచ్చేవారు. కానీ ఇప్పుడు ఆపేశారు. నేను మంచం మీద నుంచి లేవలేను. వేరే వారి సాయం లేకుండా కదలలేను. మమ్మల్ని ఇబ్బందులు పెడుతున్నారు. వలంటీర్లు మా లాంటి వాళ్లకోసం ఎన్నో సేవలందించారు. కరోనా కష్టకాలంలో మాకు కావలసిన అన్ని సౌకర్యాలు కల్పించారు. వలంటీర్లు లేకపోతే ఏమై పోయే వాళ్లమో, వాళ్ల మీద కక్ష సాధించడం, మమ్మల్ని కష్టపెట్టడం సరికాదు.

– లక్ష్మి, ఏఎస్‌ఆర్ నగర్

కేకే రాజు విజయానికి కృషి


కేకే రాజును సత్కరిస్తున్న అశోక్‌రెడ్డి, పద్మారెడ్డి

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి కేకే రాజు విజయానికి కృషి చేస్తానని జీవీఎంసీ 24వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షునిగా నియమితులైన గుడ్ల అశోక్‌రెడ్డి అన్నారు. వార్డు కార్పొరేటర్ సాడి పద్మారెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజును ఆయన మర్యాదపూర్వకంగా కలిశారు. తనకు అప్పగించిన బాధ్యతలు పూర్తిగా నెరవేర్చుతానని, రానున్న ఎన్నికల్లో కె.కె.రాజు ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో విజయం సాధించేలా కృషి చేస్తానని చెప్పారు. ఈ సందర్భంగా కె.కె.రాజును దుశ్శాలువా, పుష్పగుచ్ఛంతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో జేసీఎస్ మండల కన్వీనర్ కర్రి మురళీకృష్ణారెడ్డి, సీనియర్ నాయకులు గుడ్ల భాస్కరరెడ్డి, నక్కా ప్రకాష్ రెడ్డి, దల్లి గురుమూర్తి, గుడ్ల రఘురాం, రెడ్డి చిన్న , బి.ఎస్.ఎస్.రెడ్డి, నక్కా రమేష్ రెడ్డి, దుంగి కిశోర్, నాగరాజ్, రోహిత్ పాల్గొన్నారు.

ఉక్కు పరిరక్షణ పోరాటానికి మూడేళ్లు

సీతంపేట : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను అమ్మేయాలని చూస్తున్న ప్రధాని మోదీ, బీజేపీకి సహకరిస్తున్న టీడీపీ, జనసేన పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ జేఏసీ నాయకులు కార్మిక వర్గానికి, విశాఖ ప్రజలకు పిలుపునిచ్చారు. పోరాట కమిటీ ఆధ్వర్యంలో జీవీఎంసీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షా శిబిరం ఏప్రిల్ 2 నాటికి మూడేళ్లు పూర్తి అయిన సందర్భంగా పోరాట కమిటీ భారీ నిరసన కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి, జేఏసీ చైర్మన్ మరడాన జగ్గునాయుడు, జేఏసీ చైర్మన్ మంత్రి రాజశేఖర్, స్టీల్ గుర్తింపు యూనియన్ నాయకులు ఆదినారాయణ మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు పెద్ద ఎత్తున నిరసన చేపట్టినా మోదీ ప్రభుత్వం దిగిరాకపోవడంతో ఏప్రిల్ 2న జీవీఎంసీ వద్ద దీక్షా శిబిరం ప్రారంభించామన్నారు. మూడేళ్లుగా శిబిరాన్ని విజయవంతంగా నడిపిస్తున్న కార్మిక, విద్యార్థి, యువజన, ప్రజా, మహిళా సంఘాల నాయకులను అభినందించారు. స్టీల్ ప్లాంట్ పరిరక్షణకు నిలబడే పార్టీలను రానున్న ఎన్నికల్లో గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు నాగభూషణం, మన్మథరావు, పడాల రమణ, వామనమూర్తి, పి. మణి తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతికి సీఎం జగన్ కృషి


- అభివృద్ధి, సంక్షేమ పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలి
- ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు


మాట్లాడుతున్న కేకే రాజు, చిత్రంలో నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, వార్డు కార్పొరేటర్ కంపా హనోకు

తాటిచెట్లపాలెం: పేదల బతుకులు మార్చడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని, పలు సంక్షేమ పథకాలు అమలు చేసి వారి అభ్యున్నతికి కృషి చేశారని ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు తెలిపారు. జీవీఎంసీ 45వ వార్డు పరిధి వాసుదేవనగర్‌లో కాలనీల పెద్దలతో మంగళవారం వార్డు కార్పొరేటర్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోకు ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమష్టిగా పనిచేయాలన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు, అమలు చేసిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని తెలిపారు. పేదలు, పేదలుగా ఉంటేనే రాజకీయం చేయగలుగుతాం అనే ఆలోచన చంద్రబాబుదని, ప్రజలకు సేవ చేయాలన్న మనస్తత్వం జగన్మోహనరెడ్డిది అని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ల శివగణేష్, వార్డు అధ్యక్షుడు పైడిరమణ పార్టీ నాయకులు హరి పట్నాయక్, అంబటి శైలేష్, సన్ని, ఈశ్వర్, యాకోబు, నానిబాబు, దుర్గ, నరసింగరావు, కాలనీ పెద్దలు పాల్గొన్నారు.

అభివృద్ధి, మౌలిక వసతులపై ప్రత్యేక శ్రద్ధ

కంచరపాలెం: అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు తెలిపారు. జీవీఎంసీ 54వ వార్డు పరిధి మద్రిపాలెం పరిధి మహారాణి వీధి ఎన్నికల కార్యాలయంలో స్టాండింగ్ కమిటీ సభ్యురాలు చల్లా రజిని ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో భారీ మెజార్టీతో విజయ కేతనం ఎగరవేసి రెట్టింపు ఉత్సాహంతో తిరిగి ప్రజా సంక్షేమాన్ని కొనసాగిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, నాయకులు కృష్ణారావు, అమర్‌రెడ్డి, కణితి చిరంజీవి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న కేకే రాజు

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు


కంచరపాలెం మెయిన్‌రోడ్డులో వ్యాపారితో మాట్లాడుతున్న కేకే రాజు

కంచరపాలెం: ప్రజా సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు అన్నారు. జీవీఎంసీ 55వ వార్డు కంచరపాలెం పరిధి జాషువా నగర్, అశోక్‌నగర్, రెడ్డికంచరపాలెం ప్రాంతాల్లో మంగళవారం మార్నింగ్ వాక్‌లో స్థానికులతో ఆయన కొంతసేపు మాట్లాడారు. ముందుగా జాషువానగర్‌లో గల ప్రసన్న వినాయక ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కేకే రాజు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమానికి పెద్దపీట వేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలకు బాసటగా నిలిచారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రాగానే రెట్టింపు ఉత్సాహంతో ప్రజలకు సుపరిపాలన అందిస్తామన్నారు. అనంతరం పలువురు రోగులను పలకరించి ఆర్థిక ఆరోగ్య భరోసా ఇచ్చారు. విజయం సాధించాలని కేకే రాజుకు పలువురు వృద్ధులు దీవెనలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నార్త్ ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకట్రావ్, వార్డు కార్పొరేటర్ కె.శశికళ, వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్ యాదవ్, దుప్పలపూడి శ్రీను, సేనాపతి అప్పారావు, బొడ్డేటి గంగామహేష్, యడ్ల సిద్ధార్థ రాజు, సొండి సురేష్, వై.రాజు, ఎస్.రెడ్డి, జామి దాస్, పోలా రాజు, జోగి సతీష్, జామి కరుణ, లక్ష్మి, డైరెక్టర్ రాయుడు, యువజన విభాగం నాయకులు అంబటి శైలేష్, ఎం.సునీల్, సమ్మెట్ల వెంకటేష్, భోగవల్లి గోవిందు, సురెడ్డి, శివప్రసాద్, శ్రీకాంత్,భరత్, రాజమోహన్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


జాషువానగర్‌లో విద్యార్థితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు

క్రీడాకారులకు అండగా సీఎం వైఎస్ జగన్

ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు


హాజరైన క్రీడాకారులు

సీతంపేట: క్రీడాకారులకు అండగా నిలుస్తున్న ఏకైక నాయకుడు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమే అని వైఎస్సార్‌సీపీ విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు జి.వి.రవిరాజు ఆధ్వర్యంలో ఉత్తర నియోజకవర్గ ఎన్నికల కార్యాలయంలో క్రీడాకారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో క్రీడాకారులకు ఎటువంటి సహాయ సహకారాలు అందలేదని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డి 'ఆడుదాం ఆంధ్రా' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా పోటీలు నిర్వహించి, మట్టిలో మాణిక్యాలను వెలికి తీశారని తెలిపారు. పేద పిల్లలు కూడా క్రీడల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించేలా ప్రోత్సహించారని గుర్తుచేశారు. నేను గతంలో ఓడిపోయినా ఏరోజూ అధైర్యపడలేదని, అన్ని వ్యాపారాలు పక్కన పెట్టి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆశీస్సులతో ప్రజా సేవ చేస్తున్నానని తెలిపారు. వైఎస్సార్‌సీపీకి చెందిన 15 మంది కార్పొరేటర్లు నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ సేవలందిస్తున్నారని తెలిపారు. సుమారు రూ.435 కోట్లతో ఏడు ఆస్పత్రులు, 50 కమ్యూనిటీ హాళ్లు నిర్మించామని చెప్పారు. ఎవరు నీతినిజాయితీతో అందుబాటులో ఉన్నారో క్రీడాకారులు ఆలోచించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, డిప్యూటీమేయర్ కటుమూరి సతీష్, ఎన్నికల పరిశీలకులు, మండలాధ్యక్షుడు బానాల శ్రీనివాసరావు,యువజన విభాగం అధ్యక్షుడు ఆళ్ళ శివగణేష్, కార్పొరేటర్లు సాడి పద్మారెడ్డి, బులుసు జగదీష్, గుజ్జు వెంకటరెడ్డి, పైడి శ్రీను, కె.మురళీకృష్ణారెడ్డి, వసంతల అప్పారావు, ఎం.లక్ష్మి, భద్రి, రామకృష్ణారెడ్డి, అశోక్ రెడ్డి, బాక్సింగ్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కేకే రాజు

సమస్యలు చెప్పండి.. అన్నీ పరిష్కరిస్తాం..

- సమస్యల రహిత హాస్టళ్లే లక్ష్యం
- ఏయూ అధికారుల హామీ
- హర్షం వ్యక్తం చేసిన విద్యార్థినులు

విశాఖ సిటీ: ఏయూ హాస్టళ్లను సమస్యల రహితంగా తీర్చిదిద్దుతామని ఏయూ ఇంజినీరింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ శశి భూషణరావు విద్యార్థినులకు హామీ ఇచ్చారు. తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం వర్సిటీ పరిపాలన భవనానికి ప్రిన్సిపాల్ శశిభూషణ్‌రావుకు ఇంజినీరింగ్ కళాశాల హాస్టల్ విద్యార్థినులు విన్నవించుకున్నారు. దీనికి స్పందించిన ప్రిన్సిపాల్.. 'మీ సమస్యలు చెప్పండి.. దానికి ఏం చేయాలో కూడా చెప్పండి.. తప్పకుండా అన్నీ పరిష్కరిస్తాం..' అంటూ హామీ ఇచ్చారు. దీంతో విద్యార్థినులు హర్షం వ్యక్తం చేశారు. ఏయూలో విద్యార్థులకు మెరుగైన వసతుల కల్పనకే ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని చెప్పారు. ఎటువంటి సమస్య ఉన్నా తమకు తెలియజేయాలని సూచించారు. ఇప్పటికే ప్రతి హాస్టల్‌ని పూర్తి స్థాయిలో ఆధునికీకరించామని, టాయిలెట్స్ మార్పు చేశామన్నారు. ఓఎస్‌డీ ఆచార్య వి.కృష్ణమోహన్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సమస్యను హాస్టల్ వార్డెన్ దృష్టికి తీసుకువెళ్లాలని, అక్కడ పరిష్కారం కాని పక్షంలో ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రోద్బలంతోనో ఇటువంటి నిరసనలు చేపట్టవద్దన్నారు. మిమ్మల్ని ఎవరైనా వెనకుండి చెయ్యమన్నారా? అని ప్రశ్నించగా, ఓ మీడియా సంస్థ పేరు చెప్పడం ఓఎస్‌డీ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

అధికారుల సత్వర స్పందన

వర్సిటీ ఇంజినీర్ ఆర్.శంకరరావు వెంటనే విద్యార్థినుల హాస్టళ్లను ఆచార్యులతో కలిసి పరిశీలించారు. హాస్టళ్లలో టాయిలెట్స్ నిర్వహణ, అవసరమైన మరమ్మతులు చేపట్టాల్సిన పనులను గుర్తించారు.

దాడికి పాల్పడ్డారని వ్యాపారి ఫిర్యాదు

సీతంపేట: గోపాలపట్నానికి చెందిన దొడ్డి కిరణ్ అనే వ్యక్తి తనపై దాడికి పాల్పడ్డాడని అక్కయ్యపాలెంలోని సియాన్‌గోల్డ్ సంస్థ యజమాని సురేష్ నాల్గోపట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 80 తులాల బంగారం విడిపించేందుకు తాను అప్పుగా ఇచ్చిన రూ.47 లక్షల తిరిగి చెల్లించమంటే కిరణ్ దాడికి పాల్పడ్డాడని సురేష్ పేర్కొన్నారు. దీనిపై కిరణ్‌ను వివరణకోరగా తాను తీసుకున్న అప్పునకు ద్వారకానగర్ సీఎస్‌బీ బ్యాంకు టేకోవర్ చేసిందని, సీఎస్‌బీ బ్యాంకు డబ్బులు చెల్లించడానికి సిద్ధంగా ఉన్నా, సురేష్ బంగారం ఇవ్వడం లేదని ఆరోపించారు. సురేష్ ఆ బంగారాన్ని వేరే చోట తాకట్టు పెట్టినట్టు తెలిసిందన్నారు. సీఎస్‌బీ బ్యాంకు సురేష్‌కు రూ. 20 లక్షల వరకు చెల్లించగా దానికి సరిపడా బంగారం అప్పగించకపోవడంతో సీఎస్‌బీ బ్యాంకు ప్రతినిధులు సురేష్‌పై గోపాలపట్నం స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని ఆయన తెలిపారు. దీని నుంచి తప్పించుకునేందుకే దాడికి పాల్పడినట్టు తనపై తప్పుడు ఫిర్యాదు చేశాడని, నేను కుదువ పెట్టిన బంగారం సీఎస్‌బీకి అప్పగిస్తే సంస్థ మొత్తం డబ్బులు చెల్లిస్తుందన్నారు. నేను ఎటువంటి మోసానికి పాల్పడలేదని కిరణ్ వివరించారు.